

టిడిపి న్యాయపోరాటానికి మద్దతు : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు: ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి.. రిమాండ్‌కి పంపడం పై రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి శ్రేణులు నిరసన, ధర్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గడిచిన రెండు రోజుల నుంచి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నారు. పోలీసులు గృహ నిర్బంధాలను అతిగమించి ధర్నాలు, నిరసనలు చేస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డిని ఆయన స్వగృహంలో సిపిఎం జిల్లా నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ న్యాయపోరాటంలో భాగంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు టిడిపి చేసే కార్యక్రమాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, రాజగోపాల్, మోహన్ రావ్ ఉన్నారు.

కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

టిడిపి బంద్ పాక్షికం..!

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్, రిమాండ్‌ను నిరసిస్తూ టిడిపి ఇచ్చిన బంద్ పిలుపును పోలీసులు భగ్నం చేశారు. సోమవారం ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా టిడిపి నేతలు, కార్యకర్తలను రోడ్లపైకి రానివ్వలేదు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు మూత పడ్డాయి. విద్యాశాఖ అధికారులు పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రీవెన్స్‌కే కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు బంద్‌ను విఫలం చేయ డానికి ప్రయత్నం చేశారు. దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆర్‌టిసి బస్సులు యథావిధంగా నడిచాయి. పోలీసులు దగ్గరుండి దుకాణాలు, బస్సులు నడిపించారు. టిడిపి నేతలను బయటకు రాకుండా అడ్డుకున్నారు. గృహనిర్బంధం చేశారు.

- బంద్‌ను భగ్నం చేసిన ప్రభుత్వం
- పోలీసుల అత్యుత్సాహం
- ప్రభుత్వ సంస్థలు పనిచేయాలని ఆదేశాలు
- నేతలు గృహనిర్బంధం
- జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- టిడిపికి సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్ట్, రిమాండ్‌ను నిరసిస్తూ టిడిపి శ్రేణులు ఉదయం నుంచి ఆందోళన నిర్వహించారు. పోలీసులు బందును భగ్నం చేయడానికి ప్రయత్నాలు చేసింది. ఎక్కడికక్కడే నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. స్థానికంగా ఉండే పోలీసు స్టేషన్లకు తరలించారు. నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఇంటిలో నుంచి బయటకు రానివ్వలేదు. డిఎస్‌పి శ్రీనివాసులురెడ్డి మాగుంట లేవుట్‌లోని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఇంటికి దిగ్బంధం చేశారు. తన వల్ల ఈ ప్రాంత ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని తనను అరెస్ట్‌చేసి, పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లాలని కోటంరెడ్డి పోలీసులతో వాదనకు దిగారు. కొద్ది సేపు పోలీసులు, ఆయనకు వాగ్వాదం జరిగింది. టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని చిల్డ్రన్స్‌పార్క్ వద్ద ఆయన నివాసంలో దిగ్బంధనం చేశారు. బయటకు రాకుండా అడ్డుకున్నారు. పోలీసులకు ఆయనకు వాగ్వాదం జరిగింది. జాతీయ రహదారిపై టిఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఆర్‌టిసి వద్ద టిడిపి నేతలు వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి ధర్నా చేశారు. పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి పి. నారాయణ, అబ్దుల్ అజీజ్ ఇంటికే పరిమి తమ య్యారు. కోవూరు, కందుకూరు, సర్వేపల్లి, కావలి, ఆత్మకూరు, తదితర ప్రాంతాల్లో ఆపార్టీ నేతలు రోడ్ల మీదకు వచ్చారు. నెల్లూరు నగరంలోని వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఉదయం షాపులు మూసి వేశారు. బస్సులు,ఆటోలు యథావిధిగా నడిచాయి. చంద్రబాబునాయుడుకు ప్రజల మద్దతు లేదని చెప్పడానికి అధికారపార్టీ నేతలు ప్రయత్నాలు చేశారు. పోలీసులు బంద్‌ను భగ్నం చేశారు.

ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని నిర్బంధిస్తున్న పోలీసులు

బంద్ విజయవంతం
టిడిపి నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి...

మాజీ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలను గహ నిర్భంధం చేసినా బంద్ విజయవంతం అయిందని వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని బూటు కాలు కింద తొక్కుతున్నారు. శాంతి యుతంగా బందు చేస్తున్న టిడిపి శ్రేణులను తీసుకెళ్లి బూటు కాళ్లతో తన్నారని పోలీస్‌స్టేషన్లోకి విలేకరులను అనుమతించడం లేదని, గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. టిడిపి హయాంలో వైసిపి ధర్నాలు చేస్తుంటే స్వేచ్ఛ ఇచ్చేవారం నేటి పరిస్థితులు అలా లేవు. వందల మంది పోలీసులతో గృహ నిర్బంధాలు చేస్తున్నారన్నారు. .సిపిఎం నేతలు కోటంరెడ్డి నివాసానికి వెళ్లి మద్దతు ప్రకటించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, చంద్ర రాజగోపాల్ మోహన్‌రావు, కలిసిన వారిలో ఉన్నారు.

ఎంఎల్‌ఎ నిర్బంధం..

నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పోలీసులు నిర్బంధించారు. తన కోసం వందల కుటుంబాలను ఇబ్బంది పెట్టవద్దని డిఎస్‌పిని ఎంఎల్‌ఎ కోరారు. మూడు రోజులుగా మాగుంట లేఅవుట్ లో బారికేడ్లతో రాకపోకలు నిలిపివేయడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతు న్నారన్నారు. హౌస్ అరెస్ట్ అంటే నన్ను బయటకు రాకుండా చేయడం..... కానీ స్థానిక ప్రజలను ఇబ్బంది పెట్టమని ఉందా... కనీసం పని వారిని కూడా రానివ్వడం లేదని వాదనకు దిగారు.


కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గృహనిర్బంధం

టిడిపి నేతలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

భూసేకరణ ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రంలో చేపట్టిన ఓడరేవులు, విమానాశ్రయాల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ లో వున్న భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయా లని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. జవహర్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి, వర్చువల్ గా అమరావతి నుంచి సంబంధిత జిల్లాల కలెక్టర్లతో సమావేశమై రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట (శ్రీకాకుళం జిల్లా) ఓడరేవుల నిర్మాణాలకు సంబంధించి అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి పెండింగ్ లో వున్న భూసేకరణ ప్రక్రియ, నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పాల్గొని, రామాయపట్నం ఓడరేవు నిర్మాణానికి సంబంధించి చేపడుతున్న భూసేకరణ ప్రక్రియ వివరాలను,పనుల పురోగతిని ప్రధాన కార్యదర్శి కి వివరించారు

మాజీ సిఎంను అరెస్టు చేసిన తీరు సరికాదు
సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి-నెల్లూరు : మాజీ ముఖ్యమంత్రి నారాచంద్ర బాబు నాయుడును రాత్రి సమయంలో ఎటువంటి ముందస్తు సమాచారం తెలపకుండా నంద్యాలలో సిఐడి అరెస్టు చేసిన తీరు సరికాదని సిపిఎం జిల్లా కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. సోమవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ అవినీతిపై తాము మాట్లాడటం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయాలంటే గవర్నర్‌కు చెప్పి ఆయన అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. ఎఫ్ఐర్‌లో పేరు లేకపోయినా అరెస్టు చేశారన్నారు. ప్రతిపక్ష నాయకుడి అరెస్టు చేసేందుకు ముందు చోటు చేసుకున్న పలు అంశాలను పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం, కేంద్ర ప్రభుత్వ సహాయంతోనే ఈ దుందుడుకు చర్యలకు పాల్ప డిందని అర్థమవుతుందన్నారు. టిడిపి కార్యకర్తలను, నాయకత్వాన్ని పోలీసు సహాయంతో రెండు రోజుల పాటు గృహనిర్బందం చేయడాన్ని ఖండిస్తున్నా మన్నారు. నేతల ఇళ్ల ముందు భారీగా పోలీసులను మోహరించ చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలు నిరసన తెలియజేసే హక్కును సైతం కాలరాయడం దుర్మార్గమన్నారు. ఉద్యమాలను అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గపు చర్యలకు పాల్పడుతుందనిన్నారు. ఈ చర్యలకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన వస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్తు ఛార్జీలు పెంపుదల చేసి ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందని, ఇది అన్యాయమని ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా కరోనా సమయంలో నమోదు చేసిన కేసులను సైతం తిరిగి దర్యాప్తు ప్రారంభిస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాజీ సిఎం అరెస్టు ప్రజాభిప్రాయానికి అభ్యంతకరంగా , పూర్తిస్థాయిలో భిన్నంగా సాగిందన్నారు. ఇది కక్షపూరితంగా చేసేందే అని అభిప్రాయపడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో గడిచిన రెండు రోజుల నుంచి చోటు చేసుకుంటున్న పరిణామాలు, ప్రతిపక్ష నాయకుడిని అరెస్టు చేసిన తీరు , అరెస్టు తరువాత ప్రభుత్వం విధించే నిర్బంద కాండ పరిశీలిస్తే చాలా అభ్యంతరకరంగా ఉందన్నారు. ప్రజాఉద్యమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం, అణిచివేయడం, లాఠీ చార్జీలకు దిగడం వంటి చర్యలకు పాల్పడుతుం దన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 144 సెక్షన్లు, 30 సెక్షన్ పేరుతో ప్రతి పక్ష పార్టీలను బెదిరించడం సరికాదని, అధికార పార్టీకి అమలు కాని సెక్షన్లు ప్రతిపక్ష పార్టీలకు ఎ విధంగా అమలు అవుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి తన నిరంకుశ పాలనకు స్వస్తి పలకాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.అజయ్‌కుమార్ ఉన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : జగనన్నకు చెబుతాం(స్పందన) కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలపై సంభందిత అధికారులందరూ ప్రత్యేక దష్టి సారించి అర్జీదారుడు సంతప్తి చెందే విధంగా సమస్యలు పరిష్కరించాలని, అర్జీలు మరలా పునరావతం కాకుండా పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ వచ్చిన అర్జీలను సంభందిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, మండల, డివిజన్‌లకు సంబంధి ంచినవైతే సంభందిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు.స్థానిక కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం లోజరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోసోమవారం ప్రజల నుండి అర్జీలను కలెక్టర్ ఎం హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ ,డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, డిఆర్‌డిఎ పిడి సాంబశివా రెడ్డి స్వీకరించారు జెడ్‌పి సిఈఒ చిరంజీవి,డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎం. పెంచలయ్య, పిడి హౌసింగ్ నాగరాజు,పిడి మెప్మా రవీంద్ర, డిఈఒ గంగాభవాని, ఇరిగేష్ శాఖ ఎస్ఈ కష్ణ మోహన్, సంక్షేమ అధికారులు రమేశ్,వెంకటయ్య ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి, ఫిర్యాదులు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్యాలయంలోని డాక్టర్ .ఎ.పి.జె. అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత విభాగం అధికారులకు తెలియజేసి, సూచించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. సమస్యలు పునరావతం కాకుండా నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు .మంచినీటి కుళాయి పన్నులను బకాయిలు లేకుండా వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల భూములు ఆక్రమించారు..
'స్పందన'లో బాధితులు ఫిర్యాదు

ప్రజాశక్తి-గుడ్లూరు : మండంలోని గుండ్లపాలెంలో దళిత కుటుంబాలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న సుమారు రూ13 కోట్ల విలువ చేసే 135 ఎకరాలు భూమిని కొందరు పెత్తందారులు రెవెన్యూ అధికారుల సహకారంతో దళితుల భూములను సొంతం చేసుకుని అనుభవిస్తున్నారని, పరిశీలించి తమకు ఇప్పించాలని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం(స్పందన) విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం ప్రభుదాసు బి ఆదాము ప్రసాదు సురేషు సుబ్బరత్తమ్మ వరమ్మ ఇస్తేరమ్మ బ్రహ్మయ్య కోటేశు ఎలీషా మరో 15 దళిత కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు.

తైక్వాండో పోటీలలో కందుకూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు : సౌత్ ఇండియా తైక్వాండో పోటీలలో కందుకూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలను సాధించారు. కష్ణాజిల్లా విజయవాడలో ఈనెల 8, 9, 10 తేదీల్లో చెన్నిపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 21వ సౌత్ ఇండియా టైక్వాండో పోటీలలో నాలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానం, తమిళనాడు రెండో స్థానం, ఒడిశ్సా మూడో స్థానంలో నిలిచాయని కోచ్ ఎండి హఫీజ్ తెలిపారు. ఈ పోటీలలో కందుకూరు కు చెందిన పదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాలలో ఐదు బంగారు పతకాలు ఐదు కాంస్య పతకాలు సాధించాలని హఫీజ్ తెలిపారు. బంగారు పథకాలు సాధించిన వారిలో ఎస్.కె మతిన్, ఎస్‌డి మాసిన్, ఎస్డి ఇర్ఫాన్, ఎ జగన్, ఎ మౌనిక ఉన్నారు. కాంస్య పతకాలు సాధించిన వారిలో డివిఎం సంజయ్ ఆదిల్, బి మణిదీప్, బి నిహార్, ఎస్ కె సాది, ఏ ప్రదీప్ ఉన్నారు. పోటీలకు కందుకూరకు చెందిన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన ఎండి హఫీజ్ గ్రాండ్ మాస్టర్ బి.వి రమణయ్య ను కందుకూరు తైకాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ డి వెంకయ్య నాయుడు, డాక్టర్ జహంగీర్ సుల్తాన్ పిడికిటి వెంకటేశ్వర్లు క్రీడాకారులను అభినందించారు.

క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి -పొదలకూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 13,14 తేదీల్లో మండలంలోని మహమ్మదాపురం దొడ్ల సుబ్బా రెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరుగుతాయని సర్వేపల్లి నియోజకవర్గం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో ఆర్డినేటర్ , మహమ్మదాపురం పీడీ విజయ విశ్వేశ్వరన్ తెలిపారు. ఈ ఎంపికలలో అండర్14,అండర్ 17 విభాగాలకు 13 వ తేదీన అథ్లెటిక్స్, 14 వ తేదీన కబడ్డి,ఖో ఖో, వాలీ బాల్, త్రో బాల్,బాల్ బ్యాడ్మింటన్, టెన్ని కాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీల కోసం క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు.

చంద్రబాబు అరెస్టుకు ఖండన

తోటపల్లిగూడూరు : మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు జానకి ప్రసాద్ పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను సోమవారంబహుజన సమాజ్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గం కమిటీ కన్వీనర్ కొప్పోలు సూర్యనారాయణ,అధ్యక్షుడు బొడ్డు జయకోటి,ఉపాధ్యక్షులు, పొన్నూరు ఏడుకొండలు,ప్రధాన కార్యదర్శి పల్లం రాజా,జిల్లా కోశాధికారి మరి రామచంద్రయ్య తదితరులు ఖండించారు. జానకి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసేప్పుడు ముందుస్తు సమాచారం ఇవ్వాలన్నారు. అర్ధరాత్రి అరెస్ట్ చెయ్యడం ఏమిటని అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టు కేవలం వైసిపి ప్రభుత్వ కక్ష సాధింపు చర్య అని జానకి ప్రసాద్ ఆరోపించారు.

ఇదే కాదు.అన్ని కేసులూ బయటకొస్తాయి..!
బంద్‌కు స్పందన లేదు - మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: టిడిపి నేత నారా చంద్రబాబునాయుడు తప్పు చేసి, ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్నారని, ఇదే కాదని, మరికొన్ని కేసులు బయటకొస్తాయని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆపార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్కిల్‌డెవల ప్మెంట్ స్కామ్‌లో చంద్రబాబును దోషిగా నిర్ధారించి సిఐడి అదుపులోకి తీసుకుందని, . అరెస్టు చూపించి ఏసీబీ కోర్టు ముందుకు తీసుకెళ్లిందని, చంద్రబాబు తరపున హేమాహేమీ న్యాయవాదులు ఓవైపు, సీఐడీ తరపున ప్రభుత్వ న్యాయవాదులు ఎవరివాదనలు వారు వినిపించారు. చివరికి, న్యాయమూర్తి తీర్పుతో ఆయన్ను రిమాండ్‌కు తరలించారన్నారు. . ప్రభుత్వంపై, జగన్‌మో హన్‌రెడ్డిపై టీడీపీతో పాటు మరికొన్ని పార్టీలు కలిసి ఏవేవో నిందిలేస్తున్నా యన్నారు. టీడీపీ, జనసేన కలిసి రాష్ట్రబంద్‌కు పిలుపునిస్తే.. రాష్ట్రంలో ఎక్కడా ఏ ఒక్క వ్యక్తి స్వచ్ఛందంగా రోడ్డు మీదకొచ్చి మద్దతు తెలిపే పరిస్థితి లేదన్నారు. తమ నాయకుడు చంద్రబాబు పెద్ద మహానాయకుడని మీరు చెప్పుకోవడమే గానీ ప్రజల్లో మాత్రం అలాంటి అభిప్రాయమైతే లేదని తెలిసిపోయిం దన్నారు. చంద్రబా బునాయుడుకు ప్రజల్లో పరపతిలేదన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

బంద్ ప్రశాంతం..!

ప్రజాశక్తి-కందుకూరు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావులను అక్రమంగా అరెస్టుచేయడాన్ని నిరసిస్తూ ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య తో పాటు తెలుగు మహిళలు సోమవారం రోడ్లపైకి వచ్చారు. పోలీసుల తీరును తప్పుపడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించడంతోపాటు, అక్కడక్కడ రోడ్లపై బైఠాయిస్తూ నిరసనలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో బంద్ కార్యక్రమంపై నాయకులతో చర్చిస్తున్న సమయంలో భారీగా పోలీసులు ఇంటూరి నాగేశ్వరావుని చుట్టుముట్టి అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో పార్టీ నాయకులు నాగేశ్వరరావుని కార్యాలయం లోపలికి తీసుకువెళ్లి షట్టర్ వేసేశారు. పోలీసులు బలవంతంగా షట్టర్ తీసి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నాగేశ్వరరావుని అరెస్టు చేసి కావలి పోలీస్టేషన్‌కు తరలించారు. పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్దకు ర్యాలీగా వెళ్లి రోడ్డుపై బైఠాయించారు. దాదాపు అరగంటసేపు ముఖ్యమంత్రి డౌన్ డౌన్ అంటూ హెూరెత్తించారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. ఇంటూరి నాగేశ్వరరావు ఆచూకీ తెలియక తామంతా ఆందోళన చెందుతున్నామని, ఆయన వెంటనే విడుదల చేయాలని, అప్పటివరకు ఆందోళన విరమించేది లేదని మహిళలు స్పష్టం చేశారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గడంతో, మహిళలు మళ్లీ అక్కడి నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం, అక్కడ మరో అరగంటసేపు నినాదాలతో హెూరెత్తించారు. తర్వాత అక్కడి నుంచి పామూరు బస్టాండ్, పామూరు రోడ్డు జంక్షన్ వద్దకు ర్యాలీ చేరుకోగానే పోలీసులు మరోసారి వారిపై ఒత్తిడి పెంచి, ఆందోళన విరమించాలని హెచ్చరించారు. రావి సరిత అనే మహిళా కార్యకర్త స్పృహ తప్పి పడిపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అక్కడి నుంచి పార్టీ కార్యాలయం వరకు మహిళలు ర్యాలీ నిర్వహించి మళ్లీ అక్కడ బైఠాయించారు. తన భర్తతో ఒక్కసారైనా మాట్లాడించాలని లేకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదని ఇంటూరి సౌజన్య భీష్మించడంతో, పోలీసులు నాగేశ్వరరావు చేత ఆమెతో ఫోన్లో మాట్లాడించారు. దీంతో శాంతించిన మహిళలు కార్యక్రమాన్ని అంతటితో ముగించారు. పట్టణ మహిళా కమిటీ అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, నెల్లూరు పార్లమెంట్ మహిళా కార్యదర్శి బత్తిన ఆదెమ్మ, కందుకూరు మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు మన్నం శైలజ, రావి సరిత, ముప్పరాజు హారిక, అశ్విని, రాధ, రసూల్ బి, ఎస్తేరమ్మ, శ్రీ లక్ష్మమ్మ, దావులూరి శేషమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ, బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యంలో.నియోజకవర్గ పార్టీ ఇంచార్జ ఇంటూరి నాగేశ్వరరావుని హౌస్ అరెస్ట్ చేయడంతో ఆయన ఆదేశాలతో కందుకూరు పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 5 గంటల నుంచి కందుకూరు అర్‌టిసి డిపో గ్యారేజ్ వద్ద సోమవారం బైఠాయించారు. డిపోలో నుంచి బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయాలని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దాదాపు గంటసేపు నినాదాలతో హెూరెత్తించారు. పార్టీ శ్రేణులు తీవ్రంగా ప్రతిఘటించినప్పటికీ, పోలీసులు వారందరినీ ఈడ్చుకెళ్ళి పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గోచిపాతల మోషే, చిలకపాటి మధు తదితరులను అరెస్టు చేశారు.


గుడ్లూరులో టిడిపి నేతలు..

కందుకూరులో..

గుడ్లూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి రాజమండ్రి జైలుకి పంపిన సందర్భంగా ఆందోళన చెందిన గుడ్లూరు కు చెందిన టిడిపి నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టడంతో మండల టిడిపి అధ్యక్షులు జయనగర్ల నాగరాజు ,మద్దసాని కష్ణ ,చెన్నారెడ్డి మహేష్, రావూరి వేణుగోపాల్, పువ్వాడి వేణు తదితర నాయకుల్ని అరెస్టు చేసి విడుదల చేసినట్లు సిఐ సుబ్బారావు తెలిపారు.

పొదలకూరు : చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు నుంచి సంగం రోడ్డు కూడలి వరకు ఏ వాహనాలను పోనివ్వకుండా తెలుగు యువత నాయకులు అడ్డుకున్నారు. సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రైతు సంఘం నాయకులు కోడూరు.పెంచల భాస్కర్ రెడ్డి, మల్లినేని వెంకటేశ్వర్లు తెలుగు యువత మండల నాయకులు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, ఆదాల.మురళీ, జహీర్ , టీఎన్ ఎస్ ఎఫ్ నాయకులు సందీప్ మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్ నాయుడు, కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు ఎస్.కె మీర్ భాష ఇతర నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబును గత రెండు రోజుల నుంచి హౌస్ అరెస్ట్ చేశారు.

తోటపల్లిగూడూరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుని ఖండిస్తూ ధర్నా కార్యక్రమంని ర్వహించడానికి వెళ్తున్న తోట పల్లిగూడూరు మండల టిడిపి నాయకులను పోలీసులు సో మవారం అరెస్ట్ చేశారు. పోలీ సుల తీరుపై టీడీపీ నాయకు లు కొణతం రఘుబాబు, ము త్యాలు శ్రీనివాసులు, మన్నెం జితేంద్ర గౌడ్, పాకం వెంకయ్య తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నా యుడు అరెస్టుకు నిరసనగా టిడిపి చేపట్టిన రాష్ట్ర బంద్ జయప్రదం కాకూడదని వైసిపి సైకో ప్రభుత్వం కుట్రలు పన్నిందని విమర్శించారు.

'జగనన్నకు చెబుదాం'

నెల్లూరు : ఇక నుండి వారానికి రెండు మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం(స్పందన)నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం .హరి నారాయణన్ తెలిపారు. బుధవారం ,శుక్రవారం మండల కేంద్రాల్లో జరిగే జగనన్నకు చెబుదాం కార్య క్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహిస్తారని, జిల్లా అధికారులు, సంబంధిత మండల అధికారులు హాజరు కావాలని తెలిపారు,, కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : కుష్టు వ్యాధి విషయంలో అవగాహన కలిగి ఉండాలని లెప్రసీ, ఎయిడ్స్, టిబి కంట్రోల్, జిల్లా అధికారి డాక్టర్ ఎస్.కె ఖాదర్ వల్లి సూచించారు. సోమ వారం అయన మండలంలోని మండలం వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. డాక్టర్ ఖాదర్ వల్లి మాట్లాడుతూ కుష్టు, ఎయిడ్స్, టీబి (క్షయ) వ్యాధుల విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. సూపర్ వైజర్లు, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, ఎంఎల్హెచ్పిఎస్, ఆశా వర్కర్లు ఉన్నారు.

పంట కోత ప్రయోగం పరిశీలన

తోటపల్లిగూడూరు : ముఖ్య ప్రణాళికాధికారి సాలెంరాజు సోమవారం పంట కోత ప్రయోగాలను పరిశీలించారు. మండలంలోని పేడూరు గ్రామం సర్వే నెంబర్ 132-9 లో అర్థ గణాంక, వ్యవ సాయ శాఖలు సంయుక్తంగా పంట కోత ప్రయోగం చేశారు. వ్యవసాయ సహాయకులు ద్వారా నిర్వహించిన పంటకోత ప్రయోగాన్ని జిల్లా సిపిఒ సా లెంరాజు స్వయంగా పర్యవేక్షించారు. వ్యవసాయ విస్తరణా ధికారి హరిబాబు, వీఏఎ శివ, వినీల్ లు ఈ ప్రయోగాన్ని ని ర్వహించారు.

బడిఈడు పిల్లలను గుర్తించాలి

నెల్లూరు : బడి ఈడు పిల్లలందరూ బడి లోనే ఉండేందుకు ఉద్దేశించి స్థూల నమోదు నిష్పత్తిని మరింతగా మెరుగు పరిచేందుకు చిత్తశుద్ధితో కషి చేయాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ సంబంధిత అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుండి మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ వీక్షణ సమావేశం ద్వారా మనబడి నాడు - నేడు పనులు, హౌసింగ్ పురోగతి గురించి సమీక్షించారు.

నియామక పత్రాలు అందజేత

నెల్లూరు : ఎపిపిఎస్‌సి నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 43 మంది జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్‌లకు కలెక్టర్ ఎం. హరి నారాయణన్ సోమవారం నియామక పత్రాలు అందజేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను అభి నందించారు.జిల్లాలోని కార్యాలయాల్లో పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారు.

14న బహిరంగ సభ : భ.ని.కా

నెల్లూరు : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14వ తేదిన నగరంలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో భవన నిర్మాణ రంగానికి చెందిన కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.సుధాకర్ పిలుపు నిచ్చారు. సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆర్‌టిసి, విఆర్‌సి, మార్కెట్, ప్రగతి నగర్, శ్రామిక నగర్, మూలా పేట సెంటర్లలో విడుదల చేశారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. సిఐటియు రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.సుధాకర్ మాట్లాడుతూ ఈ నెల 15,16,17 తేదిలల్లో నగరంలో జరగనున్న 69వ జాతీయ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ, రాష్ట్ర నేతలు హాజరవుతారన్నారు. ఆటో కార్మిక సంఘం రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్యాంసన్,ఎం.సుధాకర్, చంద్ర, వెంకయ్య, ఎస్‌డి హమీద్, జి.జనార్ధన్, వెంకి, సుధాకర్,మల్లికార్జున, రసూల్ ఉన్నారు.



సంక్షేమ హాస్టళ్ల బిల్లులు తక్షణం ఇవ్వాలి

ప్రజాశక్తి-కావలి : సంక్షేమ హాస్టళ్లల్లో ఐదు నెలల నుంచి బిల్లులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లండన్ విహార యాత్రలు చేయడం న్యాయమా అని దళిత సంఘాల సమితి జిల్లా అధ్యక్షులు మల్లి ప్రశ్నించారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సమితి ఆధ్వర్యంలో ధర్నా చేసి, ఆర్.డి.ఒ. వి.కె. శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాంఘిక సంక్షేమ గిరిజన సంక్షేమ హాస్టళ్లల్లో డైట్ బిల్లులు రాక జూన్ నుంచి ఇప్పటివరకు రాకపోవడంతో నాలుగు నెలల నుంచి వార్డెన్లు అప్పులు తెచ్చి పెడుతూ, నాసి రకమైన పదార్థాలు పెడుతున్నారని తెలియజేశారు. వార్డెన్ల డబ్బులు కూడా బిల్లులు అకౌంట్లో వేయడంతో బ్యాంకు వారు అప్పులకు జమ చేసుకుంటున్నారని తెలియజేశారు. అంతటి దారుణ పరిస్థితుల్లో సంక్షేమ హాస్టళ్లల్లో ఉన్నాయని తెలియజేశారు. ఇప్పటికే అనేక సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థులు చేరడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బాలికల హాస్టళ్లను అన్ని ఎత్తివేయడంతో పెద్దపెద్ద కార్పొరేట్ పాఠశాలల్లో చేరలేక దళిత గిరిజనులు ఉపాధి పనులకు పోతున్నారని తెలియజేశారు. ఒక్కొక్క కొటేషన్ పెట్టి, అధిక ధరలకు కొటేషన్లు ఇవ్వడం వల్ల ఆ భారం అంతా కూడా పిల్లల డైట్ బిల్లులపై పడి ఇబ్బంది జరుగుతుందని తెలియజేశారు. అధిక కొటేషన్ల వల్ల రూ.125 ఉన్న కందిపప్పు రూ.185 కొటేషన్ వేసి అధికులు దోపిడీకి పాల్పడుతున్నారని, ఈ డబ్బు పిల్లలపై పడుతుందని కాబట్టి, సమగ్ర విచారణ చేసి డైట్ బిల్లులు, కాస్మొటిక్ ఛార్జీలు, హాస్టళ్ల మెయింటెనెన్స్, అన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనిటి సమాఖ్య జిల్లా అధ్యక్షులు బాపట్ల సత్యవతమ్మ, హేమంత్, వినోద్, పవన్, మాల కొండయ్య, రాకేష్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి-సీతారామపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ ఎం వి కె సుధాకర్ రావును వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిసి అల్లూరు రాజు, వైసిపి సీనియర్ నాయకుడు పాలకొలను వెంకటరామిరెడ్డితో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లోని రైతులు, ప్రజలు పలు రకాల భూ సమస్యలను ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. అదేవిధంగా అన్ని అర్హతలు ఉండి ఇంటి స్థలం లేని వారు ఇంకా ఉన్నారని వారందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చొరవ చూపాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ రకాలైన సమస్యలపై వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఒ శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. స్పందనలో వచ్చే అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండిపోకు దిలీప్ ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు ఎపిపిఎ ద్వారా గృహ నిర్మాణాల కోసం స్థలాలు పట్టాలు మంజూరు చేయాలని అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సయ్యద్‌హసన్, మండల వైద్యాధికారిణి కరిష్మా, తదితరులు పాల్గొన్నారు.

భోజన పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే స్పందన అర్జీదారులకు ఆర్‌డిఒ శీనానాయక్ రెడ్‌క్రాస్ ద్వారా ఆకలి తీర్చడం అభినందనీయమని వైసిపి 12వవార్డు ఇన్‌ఛార్జి చేవూరి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం రెడ్‌క్రాస్ సభ్యులు, రక్తదాత పర్వతరెడ్డి వేణుగోపాలరావు సహకారంతో స్పందన అర్జీదారులకు భోజన పొట్లాలు పంపిణీ చేశారు. దాత వేణుగోపాల్‌ను కిరణ్ అభినందించారు. రెడ్‌క్రాస్‌సిబ్బంది పద్మావతి, మధుసూదన్ రెడ్డి, తదితరులున్నారు.

'ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆగస్టు 30వ తేదీ నుండి సెప్టెంబర్ 27 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ దేవరకొండ.ఈశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వారి ఇంటి వద్దకే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నెలరోజుల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని అందరూ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, వైద్యఆరోగ్య సిబ్బంది హాజరుపై కార్యక్రమానికి సహకరించాలంటూ కోరారు. రెండు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-జలదంకి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో భాగంగా 13, 14వ తేదీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జలదంకిలో దిగువ కేటగిరి క్రీడాకారులతో మండల స్థాయిలో అండర్ -14, అండర్ -17 బాలుర, బాలికల ఎంపికలు జరుగుతాయని హెచ్ఎం వై.కొండారెడ్డి ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, త్రోబాల్, యోగ, వాలీబాల్‌కు సంబంధించి 15వ తేదీ జిల్లా స్థాయిలో ఎంపికలు నెల్లూరులో జరుగుతాయన్నారు. ఎంపికలో పాల్గొనే విద్యార్థులు మండలంలోని ఏదైనా పాఠశాలలో రిజిస్టర్ చేసుకొని వుండాలి.

రేపు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-దగదర్తి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం చేపడుతున్న జగనన్న చెబుదాం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హరి నారాయణ పాల్గొంటున్నారని మండల ప్రజా పరిషత్ అధికారి విజయకుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లాలని కోరారు. కార్యక్రమానికి ఎంపిటిసిలు, గృహ సారథులు, వలంటీర్లు, సర్పంచులు, మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ ఈశ్వరమ్మకు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎంపిడిఒ దేవరకొండ.ఈశ్వరమ్మను వైసిపి పాలకవర్గం నాయకులు గానుగపెంట ఓబుల్ రెడ్డి సోమవారం ఘనంగా సన్మానం చేశారు. ప్రకాశం జిల్లా సిఎస్‌పురం నుండి పదోన్నతిపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెను సోమవారం వైసిపి మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్ రెడ్డి తన అనుచరులతో కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపిటిసి ఉప్పుటూరి హరి, ఇఒపిఆర్‌డి మల్లికార్జున, గోపి, సమద్ ఇమ్రాన్, తదితరులున్నారు.

ఇంటింటికి వెళ్లి హెల్త్ సర్వే చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పురపాలక పరిధిలోని ఎంజిఆర్ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు డాక్టర్ ఉష్మా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సచివాలయ సెక్రటరీలు వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ద్వారా వలంటీర్లు హెల్త్ సెక్రటరీలు 15వ తేదీ నుండి వారి సచివాలయ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి హెల్త్ సర్వే నిర్వహించి అవసరమైన వారందరికి పరీక్షలు హెల్త్ సెక్రటరీల ద్వారా ఉచితంగా చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ సిడిపిఒ సునీతల, ఎంహెచ్‌ఓ, సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు సెంటర్లో లూనా ఎక్స్‌ఎల్‌పై రోడ్డు దాటుతున్న ఆంధ్ర భాస్కర్‌రెడ్డిని వేగంగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొన్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు నుంచి దుత్తలూరు వైపు వెళుతుండగా దారి మధ్యలో వరికుంటపాడు సెంటర్లో ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వాహనదారుడిని అదుపులోకి తీసుకొని సమాచారం సేకరిస్తున్నారు.

15 రోజుల్లో నూతన పెన్షన్లు మంజూరు

ప్రజాశక్తి-విడవలూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లను గ్రామ సచివాలయాల్లో అప్లై చేసిన 15 రోజుల లోపల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు ఎంపిపి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విడవలూరు మండల కార్యాలయంలో జరిగిన కొత్త పెన్షన్ల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ యువజన కమిటీ అధ్యక్షుడు నల్లపరెడ్డి రంజిత్ కుమార్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, నవీన్ రెడ్డి, అమృత రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

ప్రజాశక్తి-విడవలూరు : తెలంగాణ వీరవనిత పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా మండలంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు నేలత్తూరు శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు రమణయ్య, సాయి రంపాటి శ్రీనివాసులు, సురభి శ్రీనివాసులు, వెంకటేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల టిడిపి నాయకుల నిరసన

కావలిలో..

ప్రజాశక్తి-కావలి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు సోమవారం కావలిలో బంద్‌పై ఉక్కుపాదం మోపారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడుని "హౌస్ అరెస్ట్" చేశారు. ప్రతి నాయకుడి ఇంటి ముందు కనీసం 4గురు పోలీసులతో పికెట్‌లు ఏర్పాటు చేశారు. అయితే, పట్టణంలోని పాఠశాలలు మూయరాదంటూ, ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చినా కూడా పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. అన్ని బ్యాంకులను మూసి వేశారు. దుకాణ దారులు కొందరు స్వచ్ఛందంగా ముసివేశారు. బంద్‌ను ఘనంగా చేయాలనుకున్న టిడిపి నాయకుల ఎత్తుగడలను పోలీసులు భగ్నం చేశారు. కావలి టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడును గత 2 రోజులుగా హౌస్ అరెస్ట్ చేసిన విషయం పాటకులకు విధితమే అయినా ఆయన రెండు సార్లు బంద్ చేసేందుకు తన కార్యకర్తలతో కలిసి తన ఇంటినుండి బయల్దేరెందుకు రెండు సార్లు తీవ్ర ప్రయత్నం చేశారు. అయితే డిఎస్‌పి ఎం.వెంకటరమణ, ఒకటో పట్టణ సిఐ శ్రీనివాసరావు, అయన సిబ్బందితో బలవంతంగా అడ్డుకుని, సుబ్బానాయుడును చేతులపై తిరిగి ఇంటివద్దకు చేర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమని, ఆ సంఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబును అరెస్టు చేయడంతో పార్టీ రాష్ట్ర వ్యాప్త బందుకు పిలుపునిచ్చిందని అందులో భాగంగానే ఆందోళన చేస్తున్నామని నేతలు తెలిపారు. బంద్‌కు ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు తెలిపారు. టిడిపి నాయకులు నల్లమోతు శ్రీనివాసులు, మంచాల ప్రసాద్, దావులూరు దేవకుమార్, గుత్తికొండ కిశోర్ బాబు, చాగంటి వెంకటేశ్వర్లు, కుల్లూరు అశ్విని, నేలపాటి మాల్యాద్రి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : మండలంలోని జెండా దిబ్బ గ్రామంలో టిడిపి జనసేన నాయకులు ధర్నా చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్, రిమాండ్‌ను వ్యతిరేకిస్తూ టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా బందు పిలుపు నివ్వడంతో వారు ఆందోళన చేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి మూత వేయాలని సూచించారు. ఈ సందర్భంగా టిడిపి మహిళా నాయకురాలు మంజులా నాయుడు మాట్లాడుతూ తాము చేస్తున్న ధర్నాను పోలీస్‌లు అడ్డుకోవడం సరికాదన్నారు. తమ నాయకుడును అక్రమంగా అరెస్ట్ చేయించి సిఎం జగన్మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నాడని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. టిడిపి నాయకులు వేణు బాలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ టిడిపి చేపట్టిన బంద్ కార్యక్రమానికి మద్దతుగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు టిడిపి నాయకులతో స్థానిక జనసేన నాయకులు కలిసి సోమవారం మండలంలో శాంతియుత బంద్‌ను నిర్వహించారు. ఉదయం నుండే 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పోలీసులు ఎటువంటి అవాంఛనీయులు ఘటనలు జరగకుండా బంద్ చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, జనసేన జిల్లా కార్యదర్శి ఆలూరు రవీంద్ర, టిడిపి, జనసేన నాయకులు జాషువా, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నెల్లూరు - ముంబై జాతీయ రహదారిపై టిడిపి నాయకులు బంద్ నిర్వహించారు. బంద్ చేస్తున్న వారిని ఆత్మకూరు సిఐ వేణు సిబ్బందితో కలిసి అడ్డుకోవడంతో పోలీసులకు నాయకులకు మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది. ఆందోళన చేస్తున్న వారిని స్టేషన్‌కు లాక్కెళ్తుండగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, శాఖమూరి నారాయణ, మద్దిపాటి శ్రీనివాసులు నాయుడు, ఆరికట్ల పుల్లయ్య నాయుడు, తమటం గురువారెడ్డి, బాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్ట్ అమానుషం

- ఉదయగిరి ఎంఎల్ఎ చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-మర్రిపాడు : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్నడూ జరగని పరిణామాలు జరుగుతున్నాయని ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘోరమైన నీచమైన ఆగడాలు జరుగుతున్నాయని, సిఎం జగన్మోహన్ రెడ్డి రాజకీయాన్ని భ్రష్టు పట్టిస్తూ అవగాహన లేని పరిపాలన చేస్తున్నారన్నారు. సహాయ సహకారాలు అందించిన వారికే పంగ నామాలు పెడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చేసే క్రూరమైన పనులను రాష్ట్రంలోని అన్ని వర్గాల వారు నిశితంగా పరిశీలిస్తున్నారన్నారు. రాష్ట్రానికి మూడుసార్లు ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలు అందించిన చంద్రబాబు నాయుడు మహా శక్తిమంతుడని, ఎటువంటి కారణాలు చూపకుండా ఆయనను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు అరెస్టును ఇచ్చాపురం నుండి కుప్పం వరకు అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తూ సమయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. పప్పులు బెల్లం పంచడం వల్ల ఓట్లు రావని రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. అధికారం లేనప్పుడు డబ్బులకు పాల్పడిన వ్యక్తులు అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని ఊడ్చి వేశారని విమర్శించారు. నందమూరి కుటుంబానికి ఒక చరిత్ర ఉందని అలాంటి కుమార్తె మనవడిని చూసి రాష్ట్రంలోని ప్రజలు జాలితో చూస్తూ వైసిపి ప్రభుత్వంపై కోపోద్రిక్తులుగా ఉన్నారన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని భోగ్యంవారిపల్లి సెంటర్లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అరెస్ట్ చేసినందుకు నిరసనగా టిడిపి నాయకులు కార్యకర్తలు సోమవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం పలువురు టిడిపి నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసుల వాహనానికి అడ్డంగా పడుకొని తమ నిరసనను వ్యక్తపరిచారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని పోలీస్ వాహనంతో వరికుంటపాడుకు తరలించారు. వరికుంటపాడు మండలము మాజీ సింగిల్ విండో చైర్మన్ పావులూరి రవీంద్ర, లోకసాని రవి, పొలిబోయిన శ్రీకాంత్‌తో పాటూ పార్టీ మహిళా నేతలు మాగంటి శాంతి, అవుల అరుణ, తదితరులు బారి ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.

ప్రజాశక్తి-కావలి రూరల్ : ప్రతిపక్ష పార్టీ నేతలపై కుట్ర పూరిత కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిపిఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కావలి నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, దమ్ము దర్గాబాబు, నరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కక్షపూరితంగా, అవమానకరంగా అరెస్టు చేసి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. 40యేళ్ల రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబును కక్షపూరితంగా అరెస్టు చేసి జైలుకు పంపటం జగన్మోహన్ రెడ్డి నియంతపాలనకు పరాకాష్ట అన్నారు. పతిపక్ష పార్టీ నేతలపై వేదింపులు, కేసులు, అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం పోలీసు పహారాలో నడుస్తుందని, రాష్ట్రంలో ప్రజలకు భద్రత లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని, ప్రతిపక్ష పార్టీ నేతలపై కుట్రపూరిత కక్ష సాధింపు చర్యలను వెంటనే వైసిపి ప్రభుత్వం అపాలన్నారు. శాంతి యుతంగా టిడిపి బంద్‌కు పిలుపునిస్తే, కార్యకర్తలను తెల్లవారుజామున పోలీ సులు అరెస్టు చేయడం, భయభ్రాంతులకు గురిచేసి యుద్ధ వాతావరణం సృష్టించారన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా సోమవారం పట్టణంలోని టిడిపి శ్రేణులు ఉదయం తెల్లవారుజామునే పట్టణంలోని ప్రధాన రహదారులలో బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారు. సిఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వాహనాలను అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి టిడిపి శ్రేణులు చేస్తున్న బంద్ ను అడ్డుకొని పోలీస్ వాహనంలో బలవంతంగా ఎక్కించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టిడిపి స్తుతులు మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందేందుకే 14 ఏళ్లు పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుపై సిఐడి ద్వారా పలు కేసులు బనాయించి అరెస్టు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వంలో రాక్షస పాలన సాగుతుందని పలువురు అన్నారు. అక్రమ అరెస్టులతో అనగదొక్కాలని చూస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పులిమి శైలజరెడ్డి, పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, చంద్రా వెంకటసుబ్బ నాయుడు, టిడిపి అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచలయ్య చౌదరి, కేత విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు మాదాల శ్రీనివాసులు నాయుడు, గౌస్ బాషా, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, ఖాదర్ బాషా, తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బెయిల్ రావాలని సోమవారం పేటలోని నాయబ్ రసూల్ దర్గాలో టిడిపి మండల నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు డాక్టర్ ఖాజామియా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రిపై అనేక ఆరోపణలు మోపి జైలుకు పంపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అబ్బూరి రమేష్ నాయుడు, ఖాజామియా, అఫ్జల్, వాకిచర్ల బాబు, పులిమి సుధాకర్ రెడ్డి, గోవిందయ్యా, మాజీ సర్పంచ్ సంధాని, పొనుగోడు సర్పంచ్ పద్మయ్య, చెవుటూరి సురేష్, గంగవరపు సురేష్, మైనారిటీ నాయకులు యస్థాని, నజీర్, షాను, సందాని, మహబూబ్ బాషా, తెలుగు యువత నాయకులు మక్కిన శ్రీహరి, మండవ సుబ్బారావు, మనోహర్ నాయుడు, కలాం, కొప్పోలు సురేష్, అస్మాత్, బాచిన వెంగలరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వగా, బంద్‌ను భగ్నం చేసేందుకు సోమవారం పోలీసులు టిడిపి, జనసేన నేతలను స్టేషన్ అరెస్ట్ చేశారు. ఆయా పార్టీలలోని ముఖ్య నేతలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జలదంకి మండల టిడిపి అధ్యక్షులు పులిగుంట మధుమోహన్ రెడ్డి, నియోజకవర్గ రైతు నాయకులు పూనూరు భాస్కర్ రెడ్డి, మండల ఎస్‌సిసెల్ అధ్యక్షులు ఏగూరి రఘు, కావలి ఎఎంసి మాజీ డైరెక్టర్ పచ్చ పెంచల నాయుడు, జనసేన మండల అధ్యక్షులు తోట మురళి, నియోజకవర్గ నేత నిమ్మలపల్లి రామచైతన్య లతోపాటు పలువురుని స్టేషన్ అరెస్ట్ చేశారు. ముఖ్య నేతలంతా స్టేషన్లో ఉండగా, రెండు, మూడు గ్రామాలలో పార్టీ నాయకులతో సంబంధం లేకుండా ఆయా గ్రామాల పార్టీ అభిమానులు చంద్రబాబుకు మద్దతుగా బంద్‌ను నిర్వహించారు.

ప్రజాశక్తి-జలదంకి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు జగన్ నిరంకుశ పాలనకు పరాకాష్ట అని సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు, జ్యోతి ఆనందరావు అన్నారు. నారా చంద్రబాబు నాయుడు టిడిపి అధినేతగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నవారు అని, చంద్రబాబు నాయుడును అవమానకరంగా, అక్రమంగా జైలుకు పంపిన విధానం జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాష్ట్ర బంద్‌కు ఉదయగిరి నియోజకవర్గం సిపిఐ నాయకులు సంఘీభావం తెలియజేశారు.

ప్రజాశక్తి-జలదంకి : టిడిపి ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపుమేరకు సోమవారం ఎల్లారగ్రహారం గ్రామంలో సర్పంచ్ మంగళ తిరుమల నాయకులు గుర్రం ప్రవీణ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి సిఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉండగా ఇలాంటి చర్యలకు పాల్పడడం నేరమని, ఎస్ఐ పి.ఆదిలక్ష్మి ఈ ఘటనలో పాల్గొన్న 11 మందిపై కేసు నమోదు చేశారు.

ప్రజాశక్తి-కావలి : టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం వల్ల టిడిపి రాష్ట్ర బంద్‌ని పిలుపునిచ్చిన సందర్భంగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ టిడిపికి మద్దతు ఇవ్వాలని తెలియజేశారు. ఆ మేరకు సోమవారం కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం వాళ్లతో కలిసి ధర్నాలు చేయడం అని జనసేన పార్టీ పిలుపునిచ్చింది. సోమవారం ఉదయం ఐదు గంటల నుంచి కావలి నియోజక వర్గంలో ఉన్న జనసేన పార్టీ నాయకులను జనసేన కార్యకర్తలు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్యను అయన ఇంటివద్దే అరెస్ట్ చేశారు. టిడిపితో కలిసి బంద్ చేసేందుకు తన కార్యకర్తలతో వస్తుండగా, జనసేన నాయకుడు సిద్ధును, అయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. కావలి ఒకటవ పట్నంలో కొందరు జనసేన పార్టీ నాయకులను అరెస్ట్ చేశారు. తిరుమల శెట్టి సుధీర్ (కావలి నియోజకవర్గం కోఆర్డినేటర్), షేక్ అబ్దుల్ నయీమ్ (కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి), బెల్లంకొండ మస్తాన్ (కావలి పట్టణ కార్యదర్శి), ఆదిశేషయ్య (జనసేన నాయకుడు) తదితరులను నిర్బంధించారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రజాస్వామికమని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని జనసేన మండల అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ అన్నారు. సోమవారం జనసేన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ కక్షపూరితంగా రాజకీయాలకు ఆది నుంచి వైఎస్‌ఆర్ పార్టీ పునాది వేసిందని తెలిపారు. చంద్రబాబు నాయుడుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకమన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రిమాండ్ విధించిన నేపథ్యంలో టిడిపి శ్రేణులు శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తారని ముందస్తు చర్యగా సోమవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ గిరిబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లవారుజాము నుండి బస్టాండ్ సెంటర్, మార్కెట్ సెంటర్, పలు కూడలిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అనుమానితులుగా ఎవరైనా కనపడిన గుంపులుగుంపులుగా ఉండకూడదన్నారు. మండలంలో తెల్లవారుజాము నుండి బస్టాండ్ సెంటర్, చుట్టుపక్కల గ్రామాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే సమస్య లేదని ర్యాలీలు సభలు విషాదమని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి పోలీసులకు సహకరించాలన్నారు.

ప్రజాశక్తి-కొండాపురం : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు టిడిపి సేనలు బంద్ నిర్వహించాయి. మనలను సాయిపేటలో కుంకుమ మోహన్‌రావు ఆధ్వర్యంలో సాయిపేటలోని జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ప్రాథమిక పాఠశాలలో చూసి చేశారు. పేట సెంటర్లో కావలి నుండి లింగసముద్రం వెళ్తున్న ఆర్‌టిసి బస్సులను టిడిపి నాయకులు అడ్డుకునే ఆపివేశారు. అలాగే ఇసుకపాలెంలో కందుకూరు నుండి వచ్చిన బస్సును మహిళలు అడ్డుకునేశారు. కొండాపురంలోని బిఎస్ఎన్ఎల్ టిడిపి నాయకులు నిరసన తెలిపారు. కొండాపురం ఎస్ఐ ఎస్.కె.ఖాజావలీ అప్రమత్తంగా వ్యవహరించి టిడిపి ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకొని సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయన చర్యలు తీసుకున్నారు.

ప్రజాశక్తి-అల్లూరు మండల కేంద్రంలో టిడిపి నాయకులు సోమవారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున నిరసన కారులు రోడ్లపైకి వచ్చి స్థానికంగా తెరిచి ఉన్న పలు దుకాణాలను రామకృష్ణ జూనియర్ కళాశాల డిగ్రీ అండ్ పీజీ కళాశాలలు, ప్రయివేట్ పాఠశాలలను వేటిని వదలకుండా బ్యాంకులను సైతం మూత వేయించారు. అదేవిధంగా తహశీల్దార్ కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు కూడా ఎక్కడికక్కడ నిరసనకారులు వాటిని మూత వేయించారు. ఈ సందర్భంగా మండల టిడిపి నాయకుడు బీద గిరిధర్ మాట్లాడుతూ రాజకీయ కుట్రతోని తమ అధినేతను జైలు పాలు చేశారని అందుకు నిరసనగా బంద్ నిర్వహించినట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి బంద్‌కు ఎలాంటి అనుమతి లేదని వారిని నిరోధించారు. శాంతియుతంగా బంద్‌లో పాల్గొన్న పలువురు నాయకులను పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేశారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు, అరగల రమణయ్య, కృష్ణచైతన్య, చెంతాటి రాజశేఖర్ బాబు, కావలి జగన్, రాజేంద్ర, దయాకర్, నిరంజన్ రెడ్డి, హరీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని గంగపట్నం గ్రామంలో జనసేన, టిడిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జనసేన పార్టీ కోవూరు నియోజకవర్గ కేర్ టేకర్ గుడి హరి కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కొండురు సుధాకర్ రెడ్డి విచ్చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం కూలిపోక తప్పదనీ జోస్యం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండాల కృష్ణారెడ్డి, బోద్దుకూరు సుదీర్, బోద్దుకూరు సుధాకర్, మల్లికార్జున్, గోపి, గుండాల మాధవరెడ్డి, తదితరులున్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు శాంతియుతంగా నిరసన తెలిపేందుకు బయలుదేరుతున్న టిడిపి నాయకులను పోలీస్ యంత్రాంగం అక్రమ గృహ నిర్బంధం చేయడం సమంజసం కాదని టిడిపి, జనసేన నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు బిజ్జం కృష్ణారెడ్డి, జనసేన అధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌సిసెల్ అధ్యక్షులు బొగ్గవరపు వేణు, స్వర్ణ కొండయ్య, జనసేన కార్యకర్తలు కోసూరి సురేష్, కృష్ణవంశీ, సునీల్, మదన్, టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం టిడిపి అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. బోగోలు మండలంలోని పాఠశాలలను మూసివేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రం వెంకటేశ్వర్ రెడ్డి, సుధీర్‌బాబు, ఎల్.మాధవ రావు, కాంద్ర రఘురాం నాయుడు, ఎన్నాబత్తిన వెంకటేశ్వర్లు, అన్నంగి ఆదిశేషయ్య, ఆవుల సురేష్, శ్రీధర్, కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి, రాయి విజయ్‌యాదవ్, పుట్ట సుబ్బారావు, మహమ్మద్ బాషా, సుబ్బారావు, శ్రీనివాసులు, శ్రీహరి, హర్ష నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ అకౌంటెంట్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-ఉదయగిరి

సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పివి కిషోర్ కుమార్ యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎస్‌టి ఓ.సి హెచ్ మమతా పేర్కొన్నారు. గతంలో ఆయన బాలాజీ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి వదిలేయినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు తూ.చ. తప్పకుండా పాటిస్తూ విధులు నిర్వహిస్తామన్నారు. కార్యాలయానికి వచ్చిన బిల్లులను సకాలంలో పూర్తి చేస్తానన్నారు. ఎస్‌టిఒ ఆదేశాలు పాటిస్తూ వినయంగా విధులు నిర్వహిస్తానన్నారు.

మట్టి మాఫియాను ఆపాలని సిపిఎం నిరసన

నిరసన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులో ఎంపీడీఓ ఆఫీస వద్ద నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య మాట్లాడుతూ మండలంలోని పోతిరెడ్డి పాలెం గ్రామంలో పెన్నానది పొర్లుకట్టను అనుకోని 50 సంవత్సరాల నుంచి పోరంబోకు భూములను గిరిజనులు ప్రభుత్వం సాగు చేసుకోమని చెప్పి కుటుంబానికి 65 సెంట్లు ఇచ్చిందన్నారు. ఈ భూమిలో మట్టిని తాడిచెట్టులోతుగా మట్టితీసి ట్రిప్పు లెక్కన అధికారపార్టీ నాయకులు ప్రకతివనరులు దోచుకుని అమ్ముతున్నారన్నారు. అధికారులకు అరికట్టాలని చెప్పినా పట్టిచుకోలేద న్నారు. అదేవిధంగా ఎవరైతే ఈ మట్టిని అమ్ముకుంటా ఉన్నారో వారి పై కేసులుకట్టి అరెస్టు చేయాలని, అదేవిధంగా ట్రాక్టర్లు సీజ్ చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుంద న్నారు. మండల కమిటీ కోరుతూ సోమవారం తహశీల్దార్‌ను కలిసి అర్జీ అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు అదేవిధంగా మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బుజ్జయ్య, కొమరగిరి శ్రీనివాసరావు, ఎస్‌కె. బాబు, కాలేషా, ఎస్‌కె చాంద్ బాషా, తలపల లీలమ్మ, వెంకటేష్, ఖాదర్ బాషా, బాబు, మునుస్వామి, సురేంద్ర, సర్దార్, రసూల్, మోహన్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఉపాధి హామీ పథకంలో గత 17 సంవత్సరాల నుండి ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీసన వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూరు మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యూనియన్ శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో డిటి రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉద్యోగాన్ని నమ్ముకొని ఈ పథకం ముందంజలో ఉండడానికి కూలీలకు పనులు కల్పించడంలో పని దినాలు ఎక్కువ కల్పించడంలో దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో ఉండడానికి ప్రగతి సాధించడానికి కృషి చేశామన్నారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు చేస్తున్న కృషి వల్లే గుర్తింపు వచ్చిందని తెలిపారు. అలాంటి ఫీల్డ్ అసిస్టెంట్లకు చేస్తున్న కృషిని గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు ధనుంజయ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, జిల్లా నాయకులు బాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విఎస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి-కావలి రూరల్

కావలి పట్టణంలోని గాయత్రి నగర్ ప్రాంతంలోని విఎస్ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు రోజుల్లో స్కూల్స్ నడపడాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ కావలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విఎఎస్ స్కూల్ వద్ద బైటాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ రెండో శనివారం కావడంతో ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించిన దానికి విరుద్ధంగా విఎస్ స్కూల్ యాజమాన్యం తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దష్టికి రావడంతో ఎస్ఎఫ్ఐ కావలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ వద్దకు వెళ్లి కరస్పాండెంట్‌ని ప్రశ్నించగా కరస్పాండెంట్ విద్యార్థి సంగం నాయకులైన మా పైనే అసభ్య పదజాలాలతో దూషిస్తూ మీ ఐడి కార్డులు చూపించండి ఇది నా స్కూలు నేను నిర్వహించేదే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో పోండి అంటూ మమ్మల్ని బయటికి పంపి వేశారు అని తెలిపారు. విఎస్ యాజమాన్యం రెండో శనివారం ప్రభుత్వ సెలవు రోజున స్కూల్ నడుపుతున్నట్లు ఎంఇఒ గోవిందయ్యకి కూడా ఎస్ఎఫ్ఐ నాయకులు ఫోన్ లైన్ ద్వారా తెలపడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు రోజుల్లో స్కూల్ నడుపుతున్న విఎస్ స్కూల్ యాజమాన్యంపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు .అలా లేని పక్షంలో ఎంఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విఎస్ స్కూల్ కరస్పాండెంట్

బి.కొండప్ప నాయుడు వివరణ

మా స్కూల్లో ఈరోజు క్లాసులు నిర్వహించడం లేదు. మా స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులు టెన్త్ క్లాస్ పిల్లలకు ఎగ్జామ్ కనెక్ట్ చేశారు. అది కూడా సాయంత్రం మూడు గంటల నుంచి 4:30 వరకు జరిగింది. మా స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులు ప్రతిరోజూ మా స్కూల్‌లోనే పిల్లలకు ట్యూషన్ చెప్పుకుంటూ ఉంటారు. కాబట్టి పిల్లలు ఐదు గంటల సమయంలో మా స్కూల్లో ఉన్నారు.

Before The III Addl. Motor Accidents Claims Tribunal : Nellore

M.V.O.P.No. 639 / 2021

Uppala Venu - Claimant

Versus

S. Sharoodhini - Respondent

Notice

To,
S. Sharoodhini, S/o **Abdul Rashee**, Owner of the Motor Cycle bearing No. AP-26-AX-0501, residing at Muthukur Village and Mandal, SPSR Nellore District.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే18-09-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.ఉమా మహేశ్వర్, బి.కాం., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.